## క్లుప్తంగా

### నేడు పటాన్‌చెరుకు మంత్రి రాక

పటాన్‌చెరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రితో పాటు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజు శ్రీ జయపాల్ రెడ్డి, మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, కలెక్టర్ శరత్ కుమార్, శాసనమండలి మాజీ చైర్మన్ శ్రీ భూపాల్ రెడ్డి, డీఐజీ సుమతి, అదనపు ఎస్పీ ఉషా విశ్వనాథ్ హాజరవుతారని ఆయన తెలిపారు.

### సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాజపుష్ప విల్లాలో సీపీఆర్, బీఎల్ఎస్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు, సెక్యూరిటీ సిబ్బందికి ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినప్పుడు, ఫిట్స్ వచ్చిన సమయంలో పాము కరిచినప్పుడు చేయవలసిన ప్రథమ చికిత్సను వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

### మల్గిలో గ్రామ సభ


గ్రామ సభలో అధికారులు, సోషల్ ఆడిట్ సిబ్బంది

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గిలో ఆదివారం ఎన్ఆర్ఈజీఎస్ సోషల్ ఆడిట్‌కు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ మారుతి యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సభలో గత మూడు సంవత్సరాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల వివరాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రంగారావు, పంచాయతీ కార్యదర్శి గోవర్దన్, సోషల్ ఆడిట్ ఆర్‌పీలు, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

### ఘనంగా కట్టమైసమ్మ బోనాలు


అమ్మవారి సన్నిధిలో కాటా శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం గ్రామంలో కట్టమైసమ్మ జాతర ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్ర వరకూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె కృష్ణ, సర్పంచ్ ప్రకాశ్‌చారి, ఎంపీటీసీ సభ్యురాలు జానాబాయి తదితరులు పూజలు చేపట్టారు. అమ్మవారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆకాంక్షించారు.

### పోచమ్మ తల్లి ఆలయంలో పూజలు


పూజలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే దంపతులు

మనూరు(నారాయణఖేడ్): బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ పూజారులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు శ్రీకాంత్‌స్వామి, నాగయ్యస్వామి పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ ఆయా ఆకస్మిక మృతి

నారాయణఖేడ్: అంత్వార్ అంగన్‌వాడీ కేంద్రం ఆయా మణెమ్మ (50) ఆదివారం తెల్లవారు జామున ఆకస్మికంగా మృతి చెందింది. సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి, ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని టీచర్లు, సహాయకులు, సంఘ బాధ్యులు, ఆయాలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీఐటీయూ నాయకులు చిరంజీవి మృతురాలి కుటుంబీకులకు రూ.5వేల నగదు సాయం అందజేశారు.

# ఆలయాల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం, జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ పుష్ప నగేశ్ ఆధ్వర్యంలో గంపలు ఎదుర్కొనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బూరుగడ్డ నగేశ్, ఆదర్శ్ రెడ్డి, ఐలేశ్ యాదవ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వెలిమెలలో**

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, సుచరిత, మల్లెపల్లి సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం**

పట్టణంలో జరిగిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం, మల్లన్న జాతరలో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు నీలం ముదిరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు. మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, నాయకులు ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: గ్రామాల్లో జాతర్ల నిర్వహణ ఆనవాయితీగా వస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ గ్రామంలో నిర్వహించిన మల్లన్న జాతరలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు నీలం మధును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శాంతమ్మ శ్రీశైలం, మల్లేష్, బీరప్ప, జంగయ్య, రాములు, మహేశ్, ఆంజనేయులు, ప్రభు, వెంకటేశ్, శివ, భాస్కర్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రాపురం(పటాన్‌చెరు): మల్లన్న జాతరలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**మల్లన్న జాతరలో జగ్గారెడ్డి**

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇంద్రకరణ్‌లో మల్లన్నస్వామి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కూడా ఉత్సవాలకు హాజరయ్యారు.


కంది(సంగారెడ్డి): మల్లన్న స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగ్గారెడ్డి


నీలం మధును సన్మానిస్తున్న నాయకులు

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్


పనులు ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

న్యాల్‌కల్(జహీరాబాద్): మెటల్‌కుంటలో రూ.20లక్షలతో సర్పంచ్ పీటర్‌రాజు సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2, 9వ వార్డులో సీసీ రోడ్లు లేకపోవడం వల్ల ఆయా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తన దృష్టికి తేవడంతో వెంటనే రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు రాజేందర్‌రెడ్డి, ప్రవీణ్, వెంకటేశ్, బాబు, శరీఫ్, నరేందర్, జగనాథ్‌రెడ్డి, స్వామి దాస్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ : సంగారెడ్డిలోని 17వ, వార్డులో రూ.40లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆదివారం మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శంకరిలతా విజయేందర్ రెడ్డి, కౌన్సిలర్లు నాయికోటి రామప్ప, గౌసియా బేగం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# చార్జీలు పెంచిన బీఆర్ఎస్ ప్రభుత్వం

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నింటిపై చార్జీలు పెంచుతూనే, సిలిండర్‌కు రూ.50 కేంద్రం పెంచిందనే విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ధర్నాలకు పిలుపునివడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేలు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని పటాన్‌చెరు బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాజు గోపాల్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువులు, విద్యుత్ చార్జీలు, బస్‌చార్జీలు, భూముల రిజిస్ట్రేషన్ పెంచిన విషయం సీఎం కేసీఆర్‌కు తెలియనిదా అని వారు ప్రశ్నించారు. కేంద్రం గ్యాస్‌పై రూ.50 పెంచితే, వంట నూనేపై ధరలు తగ్గించిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. సీఎం కేసీఆర్‌కి, ఎమ్మెల్యేలకు ప్రధానీ మోడీని విమర్శించే స్థాయి లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సంగమేశ్, సాయి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజుగోపాల్ యాదవ్

# హక్కుల కోసం నిరంతర పోరాటం

సదాశివపేట (సంగారెడ్డి): కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం చేయాలని ఏఐటీసీ జిల్లా కార్యదర్శి బోయిన్ ప్రసాద్ అన్నారు. ఆదివారం సదాశివపేటలో ఏఐటీయూసీ నూతన మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు నీరుడు సాయిలు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ప్రభాకర్, కార్యదర్శిగా శంకరప్ప, ఉపాధ్యక్షుడుగా జానీమియా, సహాయ కార్యదర్శిగా రఘునాథ్, కోశాధికారిగా ముస్తఫా, కమిటీ సభ్యులుగా దత్తుస్వామి, ఆర్.లక్ష్మి, బుజ్జమ్మ, నర్సమ్మ, రాములు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ప్రత్యేక పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తాజోద్దీన్, షఫీ అహ్మద్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి బోయిని లక్ష్మి, మాధవి తదితరులు ఉన్నారు.


సదాశివపేట ఏఐటీయూసీ నూతన మండల కమిటీ సభ్యులు

## సంక్షిప్త వార్తలు

◆ **టెండర్లకు ఆహ్వానం**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు బస్టాండ్‌లో వివిధ వ్యాపారాలు చేసుకోవడానికి ఖాళీగా ఉన్న దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌సీయూ డిపో మేనేజర్ శ్రీనివాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...టెండర్ల చివరి గడువు ఈ నెల 13వ తేదీతో ముగుస్తుందన్నారు. దుకాణాల ఖాళీల వివరాలు, నిర్వహించాల్సిన వ్యాపారాలు, ఈఎండీలను ఒక పట్టికలో తెలియ చేశామని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్‌పై 9959226132 సంప్రదించాలని కోరారు.

◆ **ఆర్థిక సాయం**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడ గ్రామానికి చెందిన అనసూజ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు.

◆ **రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడికి సన్మానం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల ఉపాధ్యక్షుడు గౌసోద్దీన్ ఆధ్వర్యంలో మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆదివారం హైదరాబాద్‌లోని తన్వీర్ నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు శాలువా కప్పి, పూల మాలలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు రఫీయోద్దీన్ తదితరులు ఉన్నారు.

◆ **అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా సాయినాథ్ రెడ్డి ఎంపిక**

సంగారెడ్డి మున్సిపాలిటీ: వైస్సార్‌టీపీ సంగారెడ్డి అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా సాయినాథ్ రెడ్డిని నియమించారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హైద్రాబాద్‌లో తనను నియమించినట్టు పేర్కొన్నారు. కంది మండల పరిధిలోని చర్యల గ్రామానికి చెందిన తనను నియమించడం ఆనందకరమన్నారు. జిల్లా అధ్యక్షుడు మల్శెట్టి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి ఆర్ రమేశ్, దత్తారెడ్డి, జిల్లా యువజన నాయకులు సతీష్, ఆనంద్ గౌడ్, నరేశ్‌లకు దన్యవాదాలు తెలిపారు.

◆ **నేడు కంప్యూటర్ శిక్షణ మూడోబ్యాచ్ ప్రారంభం**

నారాయణఖేడ్: తెలంగాణ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ పట్టణంలోని పాత ఐకేపీ భవనంలో కంప్యూటర్ కోర్సుకు సంబంధించి మూడోబ్యాచ్ శిక్షణను సోమవారం ప్రారంభిస్తున్నట్లు శిక్షణా కేంద్రం ఇన్‌చార్జి జైపాల్ తెలిపారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లలో శిక్షణ ఇస్తామని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 7036255867 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన


నగర సంకీర్తనలో భక్తులు

జహీరాబాద్ టౌన్: హుగ్గెల్లి గ్రామంలో ఆదివారం నగర సంకీర్తన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామున హుగ్గెల్లి చేరుకుని గ్రామ ప్రజలతో కలిసి వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ మందిరం నుంచి భజనలు, కీర్తనలు ఆలపిస్తూ భక్తులు పాదయాత్ర నిర్వహించారు.

### ముగిసిన లింగాయత్ సమ్మేళనం


లింగాయత్ సమ్మేళనంలో పీఠాధిపతులు

జహీరాబాద్ టౌన్: కర్నాటకలో బసవ కల్యాణ్‌లో జరిగిన ప్రథమ రాష్ట్రీయ లింగాయత్ మహా సమ్మేళనం ఆదివారం ముగిసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రాల నుంచి లింగాయత్‌లు తరలి వచ్చారు. రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ ఆధ్వర్యంలో జహీరాబాద్ నుంచి బసవ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరశైవ లింగాయత్‌ను ప్రత్యేక ధర్మంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మేళనం నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు.

### ఘనంగా స్వయం పాలన దినోత్సవం


ఉపాధ్యాయులతో విద్యార్థులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెటల్‌కుంట జడ్పీహెచ్ఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల వేశాధారణలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా దౌలత్, ఎంఈఓగా ఆదర్శ్, హెచ్ఎంగా రాధిక, ఉపాధ్యాయులుగా పవిత్ర, భవానీ, ఎంజిల్, జ్యోతి, శ్రీవాణి, భాగ్యశ్రీ, శిరీష, దర్శన్, శాంతయ్య స్వామి, నందీశ్వర్ వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం ప్రభాకర్‌రావు, బహుమతులు ప్రదానం చేశారు.

### బోరంచ ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణఖేడ్: మనూరు మండలంలోని సుప్రసిద్ధ బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవింద్ యాదవ్, మల్‌రెడ్డి, గణేష్, నర్సింహులు, శ్రీశైలం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి**

జిన్నారం(పటాన్‌చెరు): అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జిన్నారంలోని గడ్డపోతారంలో ఆదివారం నిర్వహించిన కట్టమైసమ్మ బోనాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఊట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీద్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. రాళ్లకత్వ గ్రామంలో క్రీడాకారులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా సంక్షేమమే పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్‌లు ప్రకాశ్‌చారి, ఆంజనేయులు ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.


రాళ్లకత్వలో క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

# అవినీతిపై విచారణ చేయాలి

**బీజేపీ కౌన్సిలర్ల ఆరోపణ**

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డి మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ కౌన్సిలర్లు వాసు, నాగరాజు, నాయికోటి రమేశ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగారెడ్డి మున్సిపాలిటీలో 384 మంది కార్మికులు పని చేస్తున్నారని రికార్డుల్లో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో కేవలం 300 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. వేతనాలు మాత్రం ప్రతి నెలా 384 మంది తీసుకుంటునట్లు రికార్డుల్లో నమోదవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ 84 మంది ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో తమకు తెలియదన్నారు. పట్టణంలో 19 వాటర్ ట్యాంకుల నిర్వహణ నిమిత్తం 160 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులను ఎందుకు నియమించారో చైర్ పర్సన్ సమాధానం చెప్పాలన్నారు. ఇటీవలే కొత్తగా పార్కుల నిర్వహణకు మరో 16 మందిని తీసుకున్నారని, ఈ ఔట్ సోర్సింగ్ కార్మికుల విషయంలో అవినీతి జరుగుతుందని కౌన్సిలర్లు పేర్కొన్నారు. కేవలం చైర్ పర్సన్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులోనే 40 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు పని చేయడం వింతగా ఉందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబపాలన మాదిరిగానే సంగారెడ్డిలో మున్సిపల్ చైర్‌పర్సన్ కుటుంబపాలన కొనసాగుతుందని ఎద్దేవా చేశారు. మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశం నిర్వహించాలనే నిబంధన ఉన్నప్పటికీ నాలుగు నెలలైనా నేటికి సమావేశాలు నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. త్వరలోనే ఇక్కడ జరుగుతున్న అవినీతిపై కలెక్టర్‌తో పాటు మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రవి శంకర్, నాయకులు దోమల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ కౌన్సిలర్లు

# ఘనంగా రేణుకాచార్య జయంతి

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో రేణుకాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయన జయంతి సందర్భంగా ఝరాసంగంతో పాటు బర్దీపూర్, ఈదులపల్లి గ్రామాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచయ్యస్వామి, సర్పంచ్ బస్వరాజ్‌పాటిల్, మాజీ సర్పంచ్ రుద్రప్పపాటిల్, నిర్వాహకులు రుద్రయ్యస్వామి, మల్లయ్యస్వామి, నాగయ్యస్వామి, సంగన్న, నాగేశ్‌పాటిల్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: వీరశైవ జంగమ ఆదిగురువు రేణుకాచార్య జయంతిని ఆదివారం జంగమసమాజం ఆధ్వర్యంలో ఖేడ్ మండలం తుర్కాపల్లిలో సంగమేశ్వర ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో జగద్గురు అభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. జంగమసమాజం జిల్లా అధ్యక్షుడు సిద్ధయ్యస్వామి, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు శివకుమార్, ఇతర బాధ్యులు రేవణ్ణస్వామి, శ్రీశైలం స్వామి, నరేశ్, జగదీశ్, సిద్ధయ్య, పంచాక్షరి, మన్మథయ్యస్వామి, విజయ్‌స్వామి, చెన్‌బసప్ప, శివన్న, రాజ్‌కుమార్, శంకరయ్య పాల్గొన్నారు.


జయంతిలో జంగమసమాజ బాధ్యులు

# రాష్ట్రం నడిచేదే కేంద్ర నిధులతో

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప**

నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం నడిచేదే కేంద్ర నిధులతోనేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప తెలిపారు. నారాయణఖేడ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారిని విమర్శించడం సరికాదన్నారు. నియోజకవర్గంలో చూస్తే ఆక్సిజన్‌పార్కుతోపాటు అనేక అభివృద్ధి పనులు రూర్బన్ పథకం కింద జరిగాయన్నారు. గ్రామాల్లో వేస్తున్న సీసీ రోడ్లు ఉపాధి హామీ పథకంకు సంబంధించి కేంద్ర నిధులతోనేనని గుర్తు చేశారు. బీజేపీ అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుపునకు ఖచ్చితంగా పనిచేస్తామన్నారు. ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంగప్ప

# బీరప్ప జాతరలో బీఆర్ఎస్ నేతలు


పూజలు నిర్వహించిన సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు

హత్నూర(సంగారెడ్డి): రొయ్యపల్లి, రెడ్డి ఖానాపూర్ గ్రామాల్లో బీరప్ప జాతర ఉత్సవాల్లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వారు కోరుకునట్లు తెలిపారు. పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు జెడ్పీటీసీ ఆంజనేయులు ఆయా గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మనూరు(నారాయణఖేడ్): ఉసిరికెపల్లి గ్రామంలోని బీరప్పల కల్యాణానికి జహీరాబాద్ పార్లమెంట్ మాజీ ఎంపీ, పీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్‌సంజీవ్‌రెడ్డి, నగేశ్‌షెట్కార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని ఘనంగా సన్మానించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు రషీద్ స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

### తెలంగాణలో వైఎస్సార్ టీపీ సత్తాచాటడం ఖాయం

మనూరు(నారాయణఖేడ్): వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో వైఎస్ షర్మిళ ఆధ్వర్యంలో తమ పార్టీ సత్తాచాటడం ఖాయమని సంగారెడ్డి జిల్లా వైఎస్సార్ టీపీ అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి అన్నారు. ఆదివారం ఆయన బోరంచ నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ షర్మిళ పార్టీతోనే మేలు జరుగుతుందన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జోగిపేట(అందోల్): డాకూరు శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హత్నూర గ్రామానికి చెందిన యాదయ్య (50) మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బ్రిడ్జిపై నుంచి ఎర్రారం టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో యాదయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ సామ్యానాయక్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.